క్లుప్తంగా

నేడు జిల్లా ఎస్పీ రేపల్లె రాక

రేపల్లె రూరల్: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం ఉదయం రేపల్లె పోలీసు స్టేషన్‌ను సందర్శిస్తారని డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

ఆక్వా రైతులకు అవగాహన

కర్లపాలెం: కర్లపాలెం మండలం బుద్దాం గ్రామంలో ఎంపెడా వారి ఆధ్వర్యంలో ఆక్వారైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి బాపట్ల ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ సురేష్ పాల్గొని ప్రసంగించారు. ఆక్వా కల్చర్‌లో యాజమాన్య పద్ధతులను రైతులకు సూచించారు. అంతేకాక విభిన్న జాతుల పెంపకం మీద అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో బుద్దాం ఎంపీటీసీ సభ్యుడు జి.కమలమ్మ, ఫీల్డ్ ఆఫీసర్ సీహెచ్ఎస్ పుష్పరావు, వంశీకృష్ణ, కె.శ్రీనివాసరావులు ఉన్నారు.

ఖాజీపాలెం విద్యార్థులకు బంగారు పతకాలు



పిట్టలవానిపాలెం: గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 29వ తేదీన జరిగిన 39, 40వ స్నాతకోత్సవంలో ఖాజీపాలెం డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులకు బంగారు పతకాలు లభించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగంలో 2015–17 సంవత్సరానికి గాను బాల భవాని, 2016–18 సంవత్సరానికి గాను యేట్ర అనూష, గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకున్నారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి



వేమూరు: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన దూడ నాగరాజు (32), భార్య పద్మావతి కొల్లూరు గ్రామంలో బంధువుల వద్దకు ద్విచక్రవాహనంపై బుధవారం సాయంత్రం బయల్దేరారు. మండల పరిధిలోని చంపాడు కాలువ వద్ద రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బలంగా నాగరాజు ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో నాగరాజు సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, భార్య పద్మకు స్వల్ప గాయాలు అయ్యాయి. పద్మను 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల పరిశీలన



తెనాలిరూరల్: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశాలకు వచ్చిన దరఖాస్తులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ పరిశీలించారు. తెనాలిలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాలు 1, 2, బాలుర వసతి గృహానికి కొత్తగా 67 దరఖాస్తులు వచ్చాయి. వసతి గృహ నూతన ప్రవేశ సలహా సంఘ సమావేశం బుధవారం జరిగింది. ఈ నేపథ్యంలో దరఖాస్తులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ వాటిని ఆమోదించారు. ఏఎస్‌డబ్ల్యువో జి. శైలజ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు కె. రజని, పి. ప్రమోదిని, హేమలత, ఎస్. శ్రీనివాసరావు, ఎస్. సుజాత ఉన్నారు.

శివనాగిరెడ్డికి ప్రతిభా పురస్కారం



తెనాలి: వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న ప్రముఖులకు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం బుధవారం 2021 సంవత్సరానికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసింది. ఇందులో భాగంగా తెనాలికి చెందిన ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డికి, శిల్పకళారంగంలో ప్రతిభా పురస్కారం బహూకరించింది. శిల్పకళలో శిక్షణ పొంది అనేక ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాల నిర్మాణంలో గత 45 ఏళ్లుగా చేస్తున్న కృషికి ఈ గుర్తింపును అందజేశారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెళ్ల కిషన్‌రావు అధ్యక్షత వహించిన సభలో ఎస్వీ యూనివర్శిటీ మాజీ కులపతి, ప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ చేతులమీదుగా శివనాగిరెడ్డికి పురస్కారం ప్రదానం చేశారు.

సమస్యలకు అప్పటికప్పుడే పరిష్కారం

- గడప గడపకు మన ప్రభుత్వంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- గూడపాటివారిపాలెంలో సమస్యల పరిష్కారానికి రూ.15లక్షలు మంజూరు
- వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



గూడపాటి వారిపాలెంలో ఎంపీ మోపిదేవికి సమస్యలు చెబుతున్న మహిళలు

నగరం: గ్రామాలలో సమస్యలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. మండలంలోని తాడివాకవారిపాలెం సచివాలయ పరిధిలోని దాసరిపాలెం, పెదమట్లపూడి సచివాలయ పరిధిలోని కమ్మువారిపాలెం, గూడపాటివారిపాలెం, ఎస్సీకాలనీలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం ఎంపీ మోపిదేవి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిధులు కేటాయించారు. గ్రామస్తులు తాగునీటి సమస్య పరిష్కరించాలని, స్మశాన వాటికకు వెళ్లే రహదారిని అభివృద్ధి పరచాలని ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీ మినీరక్షిత మంచినీటి పథకానికి రూ.5లక్షలు, ఎంఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రహదారి అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరుచేశారు. ఈనిధులతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ పెదమట్లపూడి సచివాలయ పరిధిలోని పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఇప్పటివరకు రూ.11.40 కోట్లు ఇచ్చామన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా కుల, మత, రాజకీయాలకు తావులేకుండా ప్రతి ఇంటికి రూ.లక్ష నుంచి రూ.3లక్షలను అందించినట్లు తెలిపారు. ఏ ఇంటికి వెళ్లినా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో సంతోషంగా జీవిస్తున్నామని ముఖ్యమంత్రిగా ఆయనే ఉండాలని కోరుకుంటున్నారన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరికలు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలవారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. మండలంలోని తాడివాకవారిపాలెం సచివాలయ పరిధిలోని దాసరిపాలెంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో 10 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎంపీ మోపిదేవి వారికి కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నున్నా కోటేశ్వరావు, కనకరావు, బోశయ్య, కుండకర్ల శ్రీమన్నారయణ ఉన్నారు. దాసరిపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న బోగు నిర్మలకు ఎంపీ మోపిదేవి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పెదమట్లపూడి గ్రామ సచివాలయ పరిధిలో 420, తాడివాకవారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో 120 గడపలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరప్రతాలను అందజేశారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ లుక్కా వెంకటేశ్వరావు(బాపయ్య), వైఎస్సార్ సీపీ నాయకులు తాడివాక అనీల్‌కుమార్, కోటేశ్వరావు, అధికారులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు అధికారంలోకి రావడం అసంభవం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- 2024లోనూ సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణస్వీకారం చేస్తారు

నగరం: చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావడం అసంభవమని, 2024లోనూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణరావు పేర్కొన్నారు. మండలంలోని గూడపాటివారిపాలెంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మోపిదేవి మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు ఢిల్లీలో కూర్చుని పొత్తుల కోసం అర్రులు చాస్తున్నాడన్నారు. ఎన్ని పార్టీలు, ఎంత మంది కలిసివచ్చినా అధికారం వైఎస్సార్‌సీపీ దేనని స్పష్టంచేశారు. ఇప్పటివరకు చంద్రబాబు కుప్పంలో దొంగ ఓట్లతో గెలుస్తున్నాడని, ఇప్పుడు అక్కడ దొంగ ఓట్లు తొలగించేసరికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే కుప్పం వదిలి గెలుపు కోసం కృష్ణ, గుంటూరు జిల్లాలలో నియోజకవర్గాల కోసం వెతుకులాట ప్రారంభించారన్నారు. అధికారంలో ఉన్నప్పుడే లోకేష్‌ను మంగళగిరిలో గెలుపించుకోలేని అసమర్థుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబుకు, లోకేష్‌కు ఓటమి తప్పదన్నారు. యువగళం పేరుతో జనాలకు డబ్బులిచ్చి, ఆపసోపాలు పడుతూ పాదయాత్రలు చేస్తున్న లోకేష్‌ను ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండటం చంద్రబాబుకు నచ్చడం లేదన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టి రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నాడని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా ఎప్పుడు అధికారంలోకి వస్తామనే పగటి కలలు కంటున్న చంద్రబాబుకు ఓటమి తప్పదన్నారు. యావత్ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, వైఎస్సార్ సీపీ గెలుపును ఎవ్వరూ ఆపలేరన్నారు. సమావేశంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పాల్గొన్నారు.

వేధింపుల భర్తపై ఫిర్యాదు

బాపట్లటౌన్: అదనపు కట్నం తీసుకురమ్మంటూ నిత్యం తన భర్త వేదింపులకు గురిచేస్తున్నారంటూ పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన ఇందేటి అమూల్య బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒంగోలుకు చెందిన రాజేష్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం అయ్యిందని, ప్రస్తుతం అదనపు కట్నం తీసుకురమ్మంటూ నిత్యం వేధిస్తున్నారని ఫిర్యాదుచేశారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు పట్టణ ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

4న రాంబొట్లపాలెం ఉప సర్పంచ్ ఎన్నిక

చెరుకుపల్లి: రాంబొట్ల పాలెం గ్రామ సంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సెప్టెంబర్ నాల్గవ తేదీన జరగనున్నట్లు ఎన్నికల ఆర్ఓ ఫిరోజ్‌లాల్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిగిన వార్డు ఎన్నికల్లో 1,10 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని, నాల్గవ తేదీన స్థానిక సచివాలయం వద్ద ఉప సర్పంచ్ ఎన్నిక జరగనున్నట్టు తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

బీఎల్ఓలకు కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశం



ఓటర్లు జాబితా పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఓటర్ల జాబితా నూరు శాతం పారదర్శకంగా సిద్ధమయ్యేలా బీఎల్‌వోలు అత్యంత జాగ్రత్తగా ఓటర్ పరిశీలన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం నగర తూర్పు ఈఆర్‌వో, కమిషనర్ కీర్తి చేకూరి, పశ్చిమ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ పెద్ది రోజా, ఏఈఆర్‌వోలతో కలసి 94 గుంటూరు పశ్చిమ, 95 గుంటూరు తూర్పు నియోజకవర్గాల్లోని ఎల్ఐసీ కాలనీ, తుఫాన్ నగర్, అశోక్ నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో డోర్ టు డోర్ ఓటర్ సర్వేలో అందిన అర్జీలతో పాటు 2022 నుంచి తొలగించిన ఓట్ల రీవెరిఫికేషన్ వివరాలను కలెక్టర్ నేరుగా పరిశీలించారు. అర్జీదారులు, ఓటర్లతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఇంటింటి ఓటర్ సర్వే పూర్తయిందని తెలిపారు. సర్వేలో అందిన అర్జీలు, ఫారాలు ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతి బీఎల్‌వో తన పరిధిలో ఓటర్ల లిస్టు సమగ్రంగా, పారదర్శకంగా ఉండేలా బాధ్యత తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఓటు తొలగింపు, మార్పు, చేర్పులను సూపర్‌వైజరీ అధికారులు నేరుగా తనిఖీ చేసిన తర్వాతనే ఆమోదించాలని చెప్పారు. ఎన్నికల విధుల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా ఉంటే సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చనిపోయిన వారి ఓట్లు, బదిలీ ఓట్లు, ద్వంద ఓట్లు, నూతన ఓటర్ల నమోదు వివరాలను బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అర్జీలు తీసుకున్న తర్వాత సూపర్‌వైజరీ అధికారులు నేరుగా తనిఖీ చేసి సిఫార్స్ చేయాలని ఆదేశించారు. ప్రతి అర్జీ ఆమోదం అయ్యే ముందు బీఎల్ఓ, సూపర్వైజరీ అధికారులు సంతకాలు చేయాలని కలెక్టర్ చెప్పారు. డెత్ ఓట్ల తొలగింపుకు తప్పనిసరిగా సర్టిఫికెట్ అప్ లోడ్ చేయాలని, షిఫ్ట్ ఓట్లను వారి ఆమోదం ద్వారానే చేయాలని సూచించారు. 2022 నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓట్లను మరొకమారు పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఎమ్మార్వోలు, సూపర్వైజరీ అధికారులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఎఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు. అలాగే ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాసవీకి పీహెచ్‌డీ ప్రదానం



బంగారు పతకంతో వాసవీ

తెనాలిఅర్బన్: గుంటూరు జిల్లా క్రోసూరుకు చెందిన వడ్లమూడి వాసవీకి పీహెచ్‌డీ లభించింది. చలం-విశ్వనాధ సత్యనారాయణ నవలల్లోని స్త్రీ పాత్రలు తులనాత్మక పరిశీలన అనే అంశంపై ఆచార్య ఇ మాధవి పర్యవేక్షణలో తెలుగు భాషా విభాగంలో పరిశోధన చేశారు. మంగళవారం జరిగిన నాగార్జున యూనివర్శిటీ స్నాతకోత్సవంలో బంగారు పతకంతో పాటు డాక్టరేట్‌ను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అందుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

లైంగిక దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలి

గుంటూరు లీగల్: బాలబాలికలు తమపై జరుగుతున్న లైంగిక దాడులను ధైర్యం ఎదుర్కోవాలని, దురాగతాల్ని వెంటనే స్థానిక ఎంఈఓ లేదా వారి పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయాలని గుంటూరు వెస్ట్ ఎంఈఓ జ్యోతి కిరణ్ సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మీ, పుల్లయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో బుధవారం విద్యార్థులకు బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓ జ్యోతి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిపెద్ది శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించారు. ఎంఈఓ జ్యోతికిరణ్ మాట్లాడుతూ బాలలు ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ, ఆత్మరక్షణ చేసుకోవాలని సూచించారు. బచపన్ బచావో కో-ఆర్డినేటర్ తిరుపతిరావు మాట్లాడుతూ ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తున్నారని అర్థం చేసుకున్న వెంటనే అరవడం లేదా చుట్టుపక్కల వారికి చెప్పాలని సూచించారు. ఏఎస్ఐ బేబీ రాణి మాట్లాడుతూ పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. డీఎల్ఎస్ఏ ప్యానల్ అడ్వకేట్ అనిల్ కుమార్ పిల్లలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీగల్ కమ్ ప్రొహిబిషన్ అధికారి వాసంతి, పఠాన్ మొహిద్దీన్ ఖాన్, పారా లీగల్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవీంద్ర నగర్‌లోని పీఎంసీ ఉన్నత పాఠశాలలో..

రవీంద్ర నగర్‌లోని పీఎంసీ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే మంచి లక్షణాలు అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా ఎదగాలని డీఎల్ఎస్ఏ ప్యానల్ అడ్వకేట్ అనిల్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో పీఎల్‌వో వాసంతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

తెనాలిఅర్బన్: సమస్యల పరిష్కారం కోసం ప్రజలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం తెనాలి కార్యదర్శి కె బాబుప్రసాద్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో సమర భేరి ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం చంద్రబాబు నాయడు కాలనీ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు షేక్ హుస్సేన్‌వలి, భవన్నారాయణ, మహిళా సంఘ నాయకులు ఎన్ రాజ్యలక్ష్మి, షేక్ ఆషా, పి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టర్ సాధియాకు సన్మానం



ఇంటర్నేషనల్ పవర్‌లిఫ్టర్ సాధియాను సత్కరిస్తున్న నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ నూతక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ షేక్ సాధియా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ అధ్యక్షుడు బి.రాజీవ్ రత్నం మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మంగళగిరి నియోజకవర్గంలో ఉన్న జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులందరూ వ్యాయామ విద్య, జాబ్ చార్ట్, యోగా, ఆరోగ్యం మొదలైన అంశాలపై చర్చించామని తెలిపారు. ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టర్ షేక్ సాధియాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఇన్‌ఛార్జి కె.రజనీనాయక్, ఎస్.రవి, బి.రమేష్ బాబు, ఎం.రవి, డి.భాస్కరరావు, బాల త్రిపుర సుందరి, మంజులత, రాధిక, పద్మ, సాంబశివరావు పాల్గొన్నారు.

ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో బుధవారం కామర్సు విభాగంలో జాతీయ సదస్సును ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి సదస్సులు నిర్వహించడం వలన కమ్యునికేషన్ స్కిల్స్ అలవడతాయని తెలిపారు. ఈకార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌లుగా ఢిల్లీ నుంచి హజిత్ హరోడియా, బెంగళూరు నుంచి రతీష్, బాపట్ల నుంచి హనుమంతరావు, చీరాల నుంచి ప్రొఫెసర్ చాంద్‌బాష, హైదరాబాద్ నుంచి మహేశ్వర రెడ్డి, రాజేంద్ర, విశాఖపట్నం నుంచి మణికంఠలు పాల్గొన్నారని తెలిపారు. ది రూల్ ఆఫ్ యాస్ అకౌంటింగ్ ఇన్‌మోడ్రన్ ఆర్గనైజేషన్ అనే అంశంపై యూజీసీ వారి సౌజన్యంతో ఆన్‌లైన్ విధానంలో సెమినార్ నిర్వహించినట్లు తెలిపారు. తద్వారా విద్యార్థులు అకౌంటెంట్‌గా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. కళాశాల కమిటీ అధ్యక్షుడు ఎం.నరసరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీనివాస కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎం.కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, ఆంగ్ల విభాగాధిపతి కిషోర్‌కుమార్, విద్యార్థులు ఉన్నారు.

అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రతీక రాఖీ



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్ఎఫ్ఐ నాయకులు



గుళ్లపల్లి హైస్కూల్‌లో రాఖీ పౌర్ణమి వేడుకలు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాఖీ పండుగ
- డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

బాపట్ల అర్బన్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) బాలికల బృందం ఆధ్వర్యంలో రాఖీ పండుగ సందర్భంగా బుధవారం బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, పట్టంలోని వివిధ ప్రముఖులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ రాఖీ అంటే అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనకై ప్రతిజ్ఞ చేద్దాం ఆడపిల్లలను కాపాడుకుందాం అనే నినాదంతో రాఖీ పండుగ జరుపుతున్నామన్నారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలకు కారణం మద్యం, మత్తు పదార్థాలేనన్నారు. వాటి నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పటిష్టమైన చట్టాలతో మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి డ్రగ్స్‌కి వ్యతిరేకంగా రాఖీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుళ్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో...

చెరుకుపల్లి: నిజ జీవితంలో ఆకాశమంత అనురాగాన్ని, ఆత్మీయతను పంచేది అన్నా చెల్లెళ్ల మధ్య ప్రేమే అని గుళ్లపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కవిత అన్నారు. మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రాఖీ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎంతో పాటు పలువురు మహిళా ఉపాధ్యాయులు పాఠశాలోని ఉపాధ్యాయులకు రక్షబంధన్ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్, మంచాల విజయ్ కిషోర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజీ విద్యార్థులకు చాంపియన్‌షిప్ ట్రోఫీ



ట్రోఫీ సాధించిన విద్యార్థులతో డాక్టర్ వెంకటరమణ, అధ్యాపకులు

తెనాలి: ఇండియన్ ఫార్మస్యూటికల్ అసోసియేషన్, రాష్ట్ర శాఖ, చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్, గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఈనెల 27–29 తేదీల్లో జరిపిన క్రీడా, సాంస్కృతిక ప్రదర్శనల్లో స్థానిక ఏఎస్ఎన్ ఫార్మశీ కాలేజి విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. 16 కాలేజీలు పాల్గొన్న ఈవెంట్‌లో డ్యూయెట్ సాంగ్‌లో పి.షాలెంరాజు, షేక్ జువేరియా, డాన్స్ సింక్ విభాగంలో వై.మౌనిక, వి.తేజస్విలు ప్రథమ బహుమతులను గెలుపొందారు. జాతీయాలు, సామెతలు, విమెన్ టేబుల్ టెన్నిస్, డంబ్ చరాడ్స్ విభాగాల్లో ద్వితీయ బహుమతులను గెలిచారు. అత్యధిక పాయింట్లు పొంది ఈవెంట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీ, రూ.10 వేల నగదు బహుమతిని ఏఎస్ఎన్ ఫార్మశీ విద్యార్థులు కైవసం చేసుకున్నట్టు తెలియజేశారు.

జెడ్పీ స్కూల్‌లో వృక్షాబంధన్



తెనాలిఅర్బన్: జీఎంజీ సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండల గ్రామమైన అంగలకుదురులోని జిల్లా పరిషత్ పాఠశాలలో వృక్షాబంధన్ నిర్వహించారు. ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు అక్కడ ఉన్న చెట్లకు ప్లకార్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వాకా లక్ష్మణ్ నందన్, టీచర్ ప్రియాంక, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏబీ పాలెంలో కేంద్ర బృందం పర్యటన



పెదనందిపాడు: కేంద్ర సెక్రటేరియట్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల బృందం ఫౌండేషన్ ట్రైనింగ్‌లో భాగంగా గ్రామాల సందర్శన చేపట్టారు. బుధవారం మండల పరిధిలోని అబ్బినేనిగుంటపాలెం గ్రామంలో భారత్ దర్శన్ నిమిత్తం, ఎంజీఎన్ఆర్‌జీఎస్ పథకం కింద ఏర్పాటు చేసిన బ్లాక్ ప్లాంటేషన్, మైక్రోఫిల్టర్, పి.హెచ్.సెంటర్, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ పథకాల గురించి పెదనందిపాడు మండల ఇన్‌చార్జి ఏపీఓ కె.జ్యోతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి తెలియజేశారు. సెంట్రల్ టీమ్ సభ్యులు అలోక్ పాండే, అభిషేక్ భక్తి, ఆయుష్ గౌయల్, పాలక్ కుమార్ పాండే, ప్రియా వర్మ, రష్మీ చాదురే, నోడల్ ఆఫీసర్ ఎ.శేఖర్ బాబు, పెదనందిపాడు మండలం ఈఓపీఆర్డీ కె.సాయిలీల, గుంటూరు రూరల్ మండలం ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచ్ రావిపాటి కృష్ణ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రావణ సంధ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

- వైభవంగా వీరభద్రస్వామి

ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవం



తాడికొండ: తాడికొండలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ సహిత పునః ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు ధనిష్టా నక్షత్రయుక్త తులా లగ్న పుష్కరాంశ శుభ ముహుర్తంలో వేదపండితులు ఆలయ ప్రతిష్టా మహోత్సవాన్ని భక్తజన సందడి నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో బింబ ప్రతిష్ట, మహా మంగళ పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణం, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు మల్లంపల్లి వంశస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్టా మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.